కర్రల సమరానికి దేవరగట్టు సిద్ధం

- నేడు మాలమల్లేశ్వర జైత్రయాత్ర
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- ప్రశాంతంగా జరుపుకోవాలి - ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్/హోళగుంద

బన్ని ఉత్సవంలో భాగంగా కర్రల సమరానికి దేవరగట్టు సిద్ధమైంది. గురువారం రాత్రి జరిగే దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని, 110 సిసి కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సిసి కెమెరాలకు ఒక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో 15 రోజుల నుంచి వరుసగా 20 నుంచి చుట్టు పక్కల గ్రామాల ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మందిని బైండోవర్ చేశామన్నారు. దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో 5 చెక్ పోస్టులు, 10 పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. బన్ని ఉత్సవానికి ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలతో పాటు 800 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అగ్గి దివిటీలు, ఇనుప రింగులు తొడిగిన కర్రలను నిషేధించినట్లు తెలిపారు. ఇప్పటికే 340 రింగులు తొడికిన కర్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దేవరగట్టు కొండ పరిసర ప్రాంతాలైన సులువాయి, మునానుగుంది, అరికెర, కొండపైకి వెళ్లే దారిలోని బిలేహల్ వంటి పది చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాలకు కొండ దగ్గరకు అనుమతించడం లేదన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి - సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్

ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవాలు జరుపుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ తెలిపారు. బన్ని ఉత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. బన్ని ఉత్సవంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, అల్లర్లు, నిప్పులు విసరడం వంటివి చేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవంలో గాయాలు కాకుండా పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఫైర్ సిబ్బంది, వైద్యసిబ్బంది, అంబు లెన్స్ సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహాకరించాలని, భక్తుల్లో మార్పు రావాలని, ఈ కర్రల సమరానికి స్వస్తి పలకాలని దేవరగట్టు పరిసర ప్రాంతాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

దసరాకు ధరాఘాతం..!

- నిత్యావసరాల ధరలతో సామాన్యుల బెంబేలు
- పండగ పూటా భక్ష భోజనం కష్టమే..!

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

దసరాకు సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారింది. చాలా మంది ఉన్న దాంట్లోనే సర్దుకుని పండగను చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది...

పండగకు అరటి ఆకులు, మామిడి ఆకులు విక్రయిస్తున్న వ్యాపారులు

సామాన్యులకు దసరాకు ధరాఘాతం తప్పడం లేదు. దసరా సందర్భంగా జిల్లాలో చాలా మంది బక్షాలను చేసుకుంటారు. నిత్యావసర ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులకు పండగ పూట బక్ష భోజనం కష్టంగా మారనుంది. వాటికి ఉపయోగించే నిత్యావసరాల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. కర్నూలు నగరంలో కిలో శనగ బేడలు రూ.110, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆదోనిలో కంది బేడలు కిలో రూ.180, శనగ బేడలు రూ.120, కిలో మైదా పిండి రూ.50, బెల్లం రూ.60 ఉన్నాయి. నంద్యాలలో కిలో శనగ బేడలు రూ.105, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆత్మకూరులో కిలో శనగ బేడలు రూ.100, బెల్లం రూ.80, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.65 ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంటిలో పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొందరు ఉన్న దాంతో కొద్ది మొత్తంలో పిండి వంటలు చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరో వైపు గ్యాస్ ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.908గా ఉంది. దీంతో చాలా మంది ఇంట్లో స్టవ్ వెలిగించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరో వైపు వంట నూనెల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. సన్‌ఫ్లవర్ నూనె లీటర్ ప్యాకెట్ రూ.145గా ఉంది. లీటరు పామాయిల్ ధర రూ.95 ఉండగా తాజాగా రూ.115కి చేరింది. లీటరుకు రూ.20 వరకు పెరిగింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి.

అన్నీ బయటే కొనుగోలు..

ఒకప్పుడు పండుగకు కావాల్సిన వస్తువులను గ్రామాల నుంచి సేకరించేవారు. కానీ ప్రస్తుతం గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దసరాకు కావాల్సిన వస్తువులను ఎక్కువగా మంది కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. మామిడి తోరణాల దగ్గర నుంచి పూలు, పండ్లు, తమలపాకులు, వంటి వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. వీటి ధరలు కూడా తక్కువేం లేవు. కిలో బంతిపూలు రూ.70 నుంచి రూ.వంద వరకూ అమ్ముతున్నారు. వాటి దగ్గరికి వెళ్లాలంటే జేబులకు చిల్లు పడినట్లే.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వానకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. కానీ మునుపెన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి.

- జలజాక్షి, ఆదోని.

16న ప్రధాని మోడీ పర్యటన

- కలెక్టర్ డాక్టర్ సిరి - మోడీ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కర్నూలులో పర్యటించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి మోడీ పర్యటన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కాలేదన్నా రు. ప్రాథమికంగా సమాచారం అందిన నేపథ్యంలో ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో 4 వేల మందితో సమా వేశం, రోడ్ షో నిర్వహించే అవకాశం ఉన్నందున వేదిక, వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ ఏర్పాట్లపై ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్, ఆర్అండ్‌బి ఎస్ఇ తదితరులతో చర్చించారు. నగరంలో సుందరీకరణ, పారిశుధ్యం, రోడ్ల మరమ్మ తులు చేయాలని ఆదేశించారు. హెలిప్యాడ్‌ల నిర్మాణంపై ఆర్అండ్‌బి ఎస్ఇతో చర్చించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు రోడ్ షో నిర్వహణ, పార్కింగ్ అంశాలపై సమన్వయంతో పని చేయాలని సూచించారు. జెసి డాక్టర్ బి.నవ్య, డిఆర్‌డిఒ వెంకట నారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, డీఎస్పీ బాబు ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను గడువులోపు పూర్తి

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ సిరి తెలిపారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి గృహ నిర్మాణ శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లక్ష్య సాధనలో గోనెగండ్ల, పత్తికొండ, ఆలూరు, ఆదోని, ఓర్వకల్లు మండలాల్లో పురోగతి తక్కువగా ఉందన్నారు. సంబంధిత మండలాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారం రోజుల్లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో మార్చి 26లోపు పూర్తి చేయాల్సిన 24 వేల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వారపు లక్ష్యాలను నిర్దేశించి, అందుకు సంబంధించిన పురోగతి నివేదికలు పంపాలని తెలిపారు.

రైతు బజార్‌లో జిఎస్‌టిపై మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

దుకాణదారులు పాత రేట్లకు అమ్మ రాదు

దుకాణదారులు పాత ధరలకు అమ్మరాదని కలెక్టర్ డాక్టర్ సిరి తెలిపారు. స్థానిక భగత్ సింగ్ నగర్‌లో జిఎస్‌టి పన్నుల తగ్గింపుపై కలెక్టర్ అవగాహన కల్పించారు. అనంతరం సిక్యాంప్ రైతు బజార్‌లో ప్రజలకు, దుకాణదారులకు జిఎస్‌టి పన్నుల తగ్గింపు గురించి వివరించారు. రైతు బజార్‌లో దుకాణదారులతో మాట్లాడుతూ... పాత ధరలకు వస్తువులను అమ్మకూడదని తెలిపారు. అలా అమ్మితే ప్రజలు నిలదీయాలని సూచించారు. జిఎస్‌టి పన్ను తగ్గింపు ప్రయోజనాల గురించి పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు : జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, కలెక్టర్ డాక్టర్ సిరి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సుభిక్షంగా ఉండాలని మంత్రి, కలెక్టర్ ఆకాంక్షించారు.

సమస్యలతో రహమత్ నగర్ వాసులు సతమతం

- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు
- 30 ఏళ్లు గడుస్తున్నా..ఇంటి ముందు రోడ్డు లేదు -అవసరమైన కరెంటు రాదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తమ కాలనీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారుల చుట్టూ ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగి అలసట వచ్చింది తప్ప రోడ్లు, తగినంత విద్యుత్ రాలేదని రహమత్ నగర్ కాలనీ ప్రతినిధులు కాజా హుసేని, షఫీ ఉల్లా, ఉమాదేవి, అబ్దుల్లాతో పాటు పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ,మహమ్మద్ యూనుస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానికులతో కలిసి పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం ఆ కాలనీలో పర్యటించింది. వారు మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్లు గడుస్తున్నా రహమత్‌నగర్‌లో సిమెంట్ రోడ్లు వేయలేదని తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల లోవోల్టేజీ సమస్య ఏర్పడి, వీధి లైట్లు వెలగక, నీళ్ల మోటారు పనిచేయక ఇబ్బంది పడుతున్నా.. సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలో రోడ్లు లేక కాలుజారి కిందపడి తమ తండ్రికి కాలు విరిగిందని కాజా హుసేని ఆవేదన వ్యక్తం చేశారు. అబ్దుల్లా అనే యువకుడు మాట్లాడుతూ తను కూడా కిందపడి చేతి వేళ్ళు ఫ్రాక్చర్ అయ్యాయని తెలిపారు. అందరిలా పన్నులు చెల్లిస్తున్నా.. రహమత్ నగర్‌లో ఎందుకు రోడ్లు వేయకుండా వివక్షత చూపుతున్నారని కాలనీ ప్రజలు ప్రశ్నించారు. లోవోల్టేజ్ సమస్య, తగినన్ని విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రోడ్లు విద్యుత్ స్తంభాలు వేసి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ పర్యటనలో నయూమ్, మల్లికార్జున, రఫీక్, లక్ష్మణ్ గౌడ్, కాజా హుస్సేన్, ఆనందు, ఆయూబ్, జిలానిబాష, సివి వర్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను చూపుతున్న నాయకులు, కాలనీవాసులు

పెన్షన్ రివిజన్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎం .యాకోబ్

బిఎస్ఎన్ఎల్‌లో పనిచేసి పదవి విరమణ పొందిన పెన్షనర్ల అందరికీ 2017 జనవరి 1 నుండి పెన్షన్ డివిజన్‌ను వెంటనే చేయాలని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం .యాకోబ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి. వెంకట్రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్ల అసోసియేషన్ కొత్త ఢిల్లీ వారి పిలుపుమేరకు ప్రకాష్ నగర్ లోని ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ వారి కార్యాలయంలో పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి విజయభాస్కర్, ఎ. రామలింగం, పి.మద్దిలేటిలో సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. యాకోబ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి. వెంకట్రాంరెడ్డిలు మాట్లాడుతూ వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ వారు జెనీవా నగరం నందు ప్రపంచ పెన్షనర్ల దినోత్సవం జరపాలని నిర్ణయించారు. ఈ సంస్థ ప్రపంచంలోని 134 దేశాలలో పనిచేస్తున్నదన్నారు. 1945లో ప్రారంభించిన సంస్థ 80 వ వార్షికోత్సవం కూడా ఈ రోజే అని తెలిపారు. ప్రధానమైన డిమాండ్లలో ఒకటి ఒకటి 2017 నుండి పెన్షన్ డివిజన్ వెంటనే జరపాలన్నారు. ఫుల్ న్యూట్రలైజేషన్ అనగా మొత్తము టిఎ, ఎల్ డిఎను కలిపి రివిజన్ జరపాలని చెప్పారు. అన్ని పెన్షనర్ల సంఘాలతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపి, కోర్టు కేసులను ఉపసంహరించి, పెన్షన్ డివిజన్ చేయాలని కోరారు. పెన్షనర్ లందరికీ ఇందు ఏర్పాటు చేయాలని చెప్పారు.

పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆయుధ పూజ

ప్రజలకు ఎస్పీ దంపతుల దసరా శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆయుధ పూజలో ఎస్పి దంపతులు

కర్నూలు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో దుర్గాదేవికి , పోలీసులు వినియోగించే అన్ని రకాల తుపాకులకు, వాహనాలకు కర్నూలు జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, ఎపిఎస్‌పి 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ పూజలు నిర్వహించారు. ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు ఆయుధాగారంలో పోలీసులు వినియోగించే ప్రతీ ఆయుధాన్ని అలంకరించారు. దుర్గాదేవి చిత్రపటానికి, జమ్మిచెట్టుకు, పోలీసు వాహనాలకు పూజలు చేశారు. విజయాలకు చిహ్నమైన ఈ విజయదశమి అందరికి విజయం చేకూర్చాలని , సుఖ సంతోషాలతో ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎపిఎస్పీ 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ లు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కష్ణమోహన్ , కర్నూల్ డిఎస్పీ జె. బాబు ప్రసాద్, సిఐలు , ఆర్ ఐలు , ఆర్ ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వసనీయమైన సేవలతో బిఎస్ఎన్ఎల్

- బిఎస్ఎన్ఎల్ రజతోత్సవ (సిల్వర్ జూబ్లీ) వేడుకలు
- 25 సంవత్సరాలు పూర్తి చేస్తున్న బిఎస్ఎన్ఎల్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ ఏర్పాటయి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను జరుపుకుంటున్నదని , బిఎస్ఎన్ఎల్ సురక్షితమైన, చౌక ధరలతో, నమ్మకమైన సర్వీసులతో భారతదేశన్నంతటినీ కలుపుతున్నదని కర్నూలు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ తెలిపారు. బుధవారం కర్నూలు బిఎస్ఎన్ఎల్ భవన్‌లో నిర్వహించిన వ్యవస్థాపక దినోత్సవం సమావేశంలో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సంస్థ ఉద్యోగులకు, వినియోగదారులకు , భాగస్వాములకు బిఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక , రజతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సంస్థ 2000 అక్టోబర్ 1న ప్రభుత్వ రంగ పబ్లిక్ సెక్టార్ యూనిట్ గా రూపుదిద్దుకున్నప్పటి నుండి ప్రజలకు చేరువగా మారుమూల గ్రామాలకు కాపర్ ద్వారా ల్యాండ్ లైన్, బ్రాడ్ బ్యాండ్ సేవలను అందించి టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పూర్తి ఫైబర్ టెక్నాలజీ ద్వారా వాయిస్ , హై స్పీడ్ ఇంటర్నెట్ను అందిస్తున్నదని తెలిపారు. మొబైల్ సేవలలో గణనీయమైన మార్పు సాధించి ఇటీవలే స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన 4జి సర్వీసులను భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ జాతికి అంకితం చేశారన్నారు. ప్రపంచంలోనే స్వదేశీ టెక్నాలజీని ఉపయోగిస్తున్న ఆరవ అతిపెద్ద సంస్థగా బిఎస్ఎన్ఎల్ రూపుదిద్దుకుందని తెలిపారు. వినియోగదారులు తమ పాత సిమ్ కార్డులను 4జి సిమ్ కార్డులుగా మార్చుకోవాలని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ప్లాన్లను వివరించారు. రజతోత్సవాల్లో భాగంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు భాగస్వాములు ప్రకాష్ నగర్ లోని బిఎస్ఎన్ఎల్ భవన్ నుండి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవలే ఫ్రీడమ్ ప్లాన్ కింద ఎక్కువ సిమ్ములను సేల్ చేసిన ఉద్యోగులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లు , మెమెంటోలు అందించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులలో మొదటి స్థానం ఎల్ .భీమరాజు, రెండవ స్థానం ఆర్ హనుమన్న , మూడవ స్థానం ఎస్. మదన్మోహన్ సాధించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ సాయినాథ్, ఎజిఎంలు వి.శ్రీను నాయక్ , దేవచంద్ నాయక్ , లక్ష్మనాయక్, మురళీకృష్ణ , నారాయణ స్వామి, వి.జాన్సన్ , నారాయణ స్వామి , అనంత శయనా ఇతర బిఎస్ఎన్ఎల్ ఆఫీసర్లు, భాగస్వాములు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకల సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ప్రదర్శన

పింఛన్ల పంపిణీపై ఎమ్మెల్యే పర్యవేక్షణ

ప్రజాశక్తి సి బెళగల్

ఎంపిడిఒ రా ణెమ్మ ఆయా శాఖధి కారులు బుధవారం రేషన్ కార్డులు, పింఛన్లు పంపిణీ చేపట్టారు. ఇక్కడే కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేపట్టారు. ఎమ్మెల్యే రాకతో సొసైటీ చేర్మెన్ చిన్న తిమ్మప్ప, బెళగల్ ఎంపిటిసి ఈరన్న గౌడ్, నాయకులు అమర్నాథ్, హనుమంత్‌గౌడ్, ధనుంజయ, గిడ్డయ్యగౌడ్, హనుమంత్ యాదవ్ తదితరులు ఎమ్మెల్యేకు పూలమాలలతో స్వాగతించారు. అనంతరం పలువురికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

కర్నూలు క్రైమ్ : పేదలకు అభాగ్య జీవితాలకు ఎన్‌టిఆర్ భరోసా పథకం అత్యంత భరోసాగా నిలుస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం సి.బెళగల్ మండలం, పలుకుదొడ్డి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి అవ్వ తాతలకు, వికలాంగులకు, లబ్ధిదారులకు పెన్షన్ పంచారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, నాయకులు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

సి బెళగల్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



పాఠశాల విద్య నిర్వీర్యం

బోధనేతర పనులతో టీచర్ల సమయం వృథా

ప్రజాశక్తి- కోడుమూరు

విద్యార్థులకు పాఠాలు బోధించడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యం. విద్యార్థులు ఎలా చదువుతున్నారు. ఇచ్చిన హోమ్ వర్క్‌ను పూర్తి చేశారా లేదా, పరీక్షల్లో ఫలితాలు ఎలా ఉన్నాయి. ఇలాంటి కీలక అంశాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. ప్రస్తుతం పాఠశాలల విద్యా బోధన అస్తవ్యస్తంగా తయారయింది. ప్రభుత్వం రికార్డుల పేరుతో, ప్రతిష్టల పేరుతో టీచర్లకు పాఠశాల విద్య భారంగా మారుతోంది. కనీసం నిధులు ఇవ్వకుండా పాఠశాలలో కళాశాలలో ప్రభుత్వం చేస్తున్న హడావిడి సర్వాత్రా చర్చనీయాంశం అవుతోంది. రికార్డుల కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించడం వలన పాఠశాల లక్ష్యాలు నీరు గారి పోతున్నాయి. ఇందుకు ఉదాహరణ కోడుమూరు మండల కేంద్రంలోని జివిఆర్ జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో అతి తక్కువ మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కోడుమూరు బాలుర హైస్కూల్లో ఇలాంటి ఫలితాలు రావడం చర్చనీయాంశమైంది. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు అసలే ఉత్తీర్ణత శాతం పడిపోతున్న స్కూళ్లలో సభలు, సమావేశాల పేరుతో కాలం వెలదీస్తున్నారు. కనీసం పలానా స్కూల్లో ఫలితాలు ఎందుకు తక్కువ వచ్చాయని, ఎన్ని సమీక్షలు జరిపారు. ఫలితాలు మెరుగు పడడానికి ఎన్ని చర్యలు తీసుకున్నారు డిఇఒ అంటూ తల్లితండ్రులు పెదవి విరుస్తున్నారు. యోగాంధ్ర, పేరెంట్స్ మీటింగ్ , క్లస్టర్ సమావేశాలు అంటూ టీచర్లను సమావేశాలకు సన్నాహాలకు పరిమితం చేస్తున్నడంతో వారు బోధనకు దూరం అవుతున్నారు. పాఠశాల పునః ప్రారంభం జూన్ 12 అయితే అందులోనే మెగా పేరెంట్స్ మీటింగ్ జులై 10న నిర్వహించారు. ఈ మధ్యలో యోగాంధ్ర పేరుతో మరింత 30 రోజులు సమయం వృథా చేశారు. తాంబూలాలు ఇచ్చేశాను ఇక తన్నుకు చావండి అనే రీతిలో ప్రభుత్వం వ్యవహరిస్తోందని టీచర్లు మదన పడుతున్నారు. మన రాష్ట్రంలో కరోనా కాలంలో 4 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరగా, కరోనా అనంతరం 10 లక్షల మంది ప్రభుత్వ బడిని వదిలి వెళ్లినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

యాప్స్ గోల తీరేది ఎలా? : ఉపాధ్యాయులు మునుపటి రోజులలో లెసన్ ప్లానింగ్‌తో పాఠశాలకు వచ్చేవారు ఇలా చేయడం వల్ల సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించడానికి సహాయపడేది. ఉపాధ్యాయులు స్కూలుకు వచ్చేటప్పుడు ఏ ఫోటో అప్లోడ్ చేయాలి, ఏ మొక్క నాటి అప్లోడ్ చేయాలి అనే భావనతో స్కూలుకు రావడం వలన ఉపాధ్యాయులలో సరైన ప్రణాళిక లేక విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా తయారవుతోంది. ఇంటర్‌నెట్ కారణంగా అప్లోడ్ ప్రక్రియ మరింత ఆలస్యం అవుతోంది. మరో ప్రక్క శిక్షణ కార్యక్రమాలకు తరచుగా మండల కేంద్రాలకు వెళ్లడం. మొక్కలు నాటించడం మూడు నెలలకు ఒకసారి ఫోటోలను అప్లోడ్ చేయడం ఇదంతా ఉపాధ్యాయుల పని, దీనిపై టీచర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు ఆన్‌లైన్ హాజరు నమోదు, మరుగుదొడ్లు మధ్యాహ్నం భోజనం పాఠ్యపుస్తకాలు వివరాల, విద్యా కిట్ల పంపిణీ నమోదు లాంటి పనులను ఉపాధ్యాయులతోనే చేయిస్తున్నారు. ఇది చాలదు అన్నట్టు సరుకులు, ఆహార పదార్థాలు, విద్యార్థులు తినే ఫ్లోర్ ఫోటోలు తీసి అప్లోడ్ చేయండి అంటూ 14 రకాల యాప్‌ల బాధ్యతలను అప్పగించారు. పేరెంట్స్ మీటింగ్ సమయంలో అధికార పార్టీ నేతలు విఐపిలు పూర్వ విద్యార్థులు దాతలు ఇలా అనేక మందిని మీటింగుకు ఆహ్వానించి వీరందరికీ భోజనాలు స్నాక్స్ ఇతరత్రా ఏర్పాటుకు కనీసం రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. పాఠశాల గ్రాంట్ కింద కనీసం నిధులు విడుదల చేయకుండా అందులో 20 శాతం వాడుకోమని ఆదేశాలు ఇచ్చారు.

క్లస్టర్ సమావేశాలతో కాలయాపన: క్లస్టర్ సమావేశాలతో ప్రతినెల మూడవ శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి విద్యార్థులకు సెలవు ఇస్తున్నారు. ఉపాధ్యాయులకు మాత్రం మధ్యాహ్నం నుండి ఆయా మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన క్లస్టర్ పాఠశాలలకు సమావేశంలో పాల్గొనాలి. తరచుగా జరిగే సమావేశాల వలన విద్యార్థులు తరగతి గదుల్లో ఉండే సమయం తగ్గిపోతుంది.

బోధనేతర పనులు అప్పగించరాదు

బి. నవీన్ పాటి , యుటి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



బోధినేతర పనులను అప్పగించకుండా పూర్తిగా ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి. యాప్‌ల నమోదు ప్రక్రియను నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి. ప్రతి స్కూల్లో ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించి వారికే యాప్‌ల నమోదును అప్పగించాలి.

ఫలితాల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం

ఎంఇఒ వసంత బాయి

ప్రతిరోజు సాయంకాలం స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నాం. సిలబస్ ను నవంబర్ 30 లోపు పూర్తి అయ్యేటట్టు ప్రణాళికలు రూపొందించాం. ప్రతి పాఠం అయిపోగానే అసైన్‌మెంట్లు రాయిస్తూ పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

ధర్మవరం సుబ్బారెడ్డిని, మీనాక్షి నాయుడును సన్మానిస్తున్న నాయకులు

ఆదోనిలో ఇన్‌ఛార్జీ మార్పు ఉండదు

- టిడిపి అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో జనాదరణ కలిగి, కార్యకర్తలకు అందుబాటులో ఉన్న మీనాక్షి నాయుడు టిడిపి ఇన్‌ఛార్జీగా కొనసాగుతారని నియోజకవర్గ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఆదోనిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలూరులో గ్రూపు విభేదాలు తారాస్థాయికి చేరడంతోనే అధిష్టానం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీని మార్పు చేసిందన్నారు. ఆదోనిలో కూడా మార్పు చేస్తారని అపోహలు ఉన్నాయని, ఆదోనిలో ఆ అవసరం లేదని తెలిపారు. పుకార్లను నమ్మవద్దని, మీనాక్షి నాయుడు నాయకత్వంలోనే పనిచేయాలని పార్టీ కేడర్‌కు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకమని తెలిపారు. సమస్యల పరిష్కారానికి పోరాడడంలో తప్పు లేదని, 1వ తేదీన పింఛను దారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు తిమ్మప్ప, శివప్ప, ఆరెకల్లు రామకృష్ణ పాల్గొన్నారు.

ఏజెంట్ల సమస్యల పరిష్కార వేదిక.. లియాఫీ

- ఎమ్మిగనూరు బ్రాంచి అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

మాట్లాడుతున్న మేనేజర్ పుల్లి నాయక్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కార వేదికగా లియాఫీ పని చేస్తోందని లియాఫీ ఎమ్మిగనూరు బ్రాంచి అధ్యక్షులు బి.ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి బి.జయన్న, ఆర్థిక కార్యదర్శి బి.వీరేష్, జోనల్ డివిజన్ లీడర్లు రమేష్, సోమన్న, బ్రాంచి మాజీ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లియాఫీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మిగనూరు బ్రాంచిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫీ నిరంతరం కృషి చేస్తోందని, పాలసీదారులకు పాలసీలపై జిఎస్‌టి ఎత్తివేయాలని ఉద్యోగ సంఘాలతో కలిసి పోరాడిందని తెలిపారు. ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం పాలసీలపై జిఎస్‌టి ఎత్తివేసిందని చెప్పారు. ముఖ్య అతిథిగా బ్రాంచి మేనేజర్ పుల్లి నాయక్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ సంతోష్ కుమార్, ఐసియు నాయకులు విజయ్ కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ రామకృష్ణ మాట్లాడుతూ... జిఎస్‌టి ఎత్తివేసిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పాలసీలను తీసుకొచ్చి వ్యాపార అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. అనంతరం మేనేజర్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్, ఐసియు నాయకులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్‌లు ఏజెంట్లను సన్మానించారు. డివిజనల్ నాయకులు అనంత రామన్న బుర్లి, హరినాథ్, సీనియర్ ఏజెంట్ రాజగోపాల్ శెట్టి, పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

- మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాధవరావు దేశాయ్

యువత క్రీడల్లో రాణించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయ్ తెలిపారు. దసరా సందర్భంగా బుధవారం నందవరం గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువకుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. టోర్నమెంటుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి 30 జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. పట్టుదలతో ఆడి విజయం సాధించాలని జట్ల సభ్యులకు తెలిపారు. మొదటి బహుమతి రూ.10,116, రెండో బహుమతి రూ.5,116, మూడో బహుమతి రూ.3,116 ఇస్తున్నట్లు చెప్పారు. టిడిపి మండల కార్యదర్శి లక్షప్ప, రేషన్ డీలర్లు చాకలి మల్లికార్జున, చాకలి వెంకటేష్, బి.మోహన్, తెలుగు ఈరన్న, వడ్డేగేరి నరసింహులు, చాకలి శ్రీనివాస్, చాకలి పంపయ్య, నజీర్, వంకగడ్డ వలీ, సల్మాన్, దావీద్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల కోసం సమిష్టి పోరాటం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అభివృద్ధికి తలమానికమైన మెడికల్ కళాశాల కోసం సమిష్టి పోరాటాలకు సంసిద్ధమని, 80 శాతం నిర్మాణం పూర్తయిన కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి నిర్వహించాలని వక్తలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ తగదంటూ నినదించారు. ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కళాశాలలో విద్యార్థి, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వెంకప్ప, మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్, మానవ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు యుజి.శ్రీనివాసులు, జై భీమ్ యూత్ నాయకులు నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు, యుటిఎఫ్ ఆడిట్ కమిటీ జిల్లా నాయకులు శ్రీనివాసులు, బిటిఎ జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఎస్‌డిపిఐ నాయకులు సద్దాం హుస్సేన్, సోషల్ వర్కర్ నూర్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అమీర్ బాష, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, రాష్ట్ర నాయకులు నాగరాజు, డిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉదయ్, పిడిఎస్ఒ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తిక్కప్ప, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాథ్ హాజరై మాట్లాడారు. ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ప్రయివేటీకరణ దుర్మార్గమని విమర్శించారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాటం చేస్తామని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చాక మెడికల్ కళాశాల పనులను నిలిపివేసి పిపిపి విధానంలో కొనసాగించడానికి కేబినెట్ తీర్మానం చేయడం భావ్యం కాదన్నారు. ప్రయివేటీకరణతో పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని తెలిపారు. కళాశాల కోసం ఎస్ఎఫ్ఐ పోరాటం చారిత్రాత్మకమని కొనియాడారు. వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, అజీమ్ ఖాన్, ఎస్ఎఫ్ఐ నాయకులు సంజయ్, అరుణ్, రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - కోసిగి


కోసిగిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని నేలకోసిగి, వందగల్లు గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, ఎంపిడిఒ ఈశ్వరయ్య స్వామి ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేస్తూ జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. అనంతరం వందగల్లు గ్రామంలో గ్రాంట్ లేక ఆగిపోయిన స్కూల్ బిల్డింగ్‌ను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పనులను మొదలు పెట్టిస్తామని తెలిపారు. ఎఒ వరప్రసాద్, ముత్తురెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్సిరెడ్డి, తిమ్మప్ప, పంపాపతి, వీరేష్, దేవరాజు, నాగలింగ, నరసింహులు, చిన్నారెడ్డి, జింకల హనుమంతు, చూడి రోగయ్య, మల్లేగేరి రామాంజి, నాడిగినేని తాయన్న పాల్గొన్నారు. **కౌతాళంలో** టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, పట్టణ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, ఉమేష్ గౌడ్, బీసీ సాధికారక సభ్యులు సిద్ధు, చౌదరి సోమన్న, కూటమి నాయకులు రామచంద్ర, తెలుగు యువత చిరంజీవి, భీమయ్య పాల్గొన్నారు.

కౌతాళంలో

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అపార నష్టం వాటిల్లిందని, రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి విమర్శించారు. బుధవారం మండలంలోని అలారుదిన్నె హంద్రీ వాగు సమీపంలో దెబ్బతిన్న పత్తి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతు కురువ మల్లికార్జున మాట్లాడుతూ... తాను 4 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశానని, గత 2 నెలల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినిందని వాపోయారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ... రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తున్నాననిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పుకుంటున్నారని, రైతులను ఆదుకోవడం లేదని విమర్శించారు. మండలంలో వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోనే దేవనకొండ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయిందని తెలిపారు. హంద్రీ వాగు, వంకలు, చెరువులు పొంగి వరద నీటికి పత్తి, మిరప, టమోటా, ఉల్లి, వేరుశనగ, ఆముదం వంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోకపోతే మండలవ్యాప్తంగా రైతులను కూడగట్టి దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో, ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. జడ్పిటిసి కిట్టు, వైసిపి మండల నాయకులు ప్రభాకరరెడ్డి, హంపిరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, నారాయణరెడ్డి, ప్రేమనాథరెడ్డి, ప్రతాప్, సర్పంచి మల్లయ్య పాల్గొన్నారు.

పంటలు దెబ్బతిన్న రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

కాశీ విశ్వనాథ్ మృతి బాధాకరం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి- దేవనకొండ

సుదీర్ఘకాలంగా సిపిఎం, ప్రజా సంఘాల్లో పనిచేస్తూ కాశీ విశ్వనాథ్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని, ఆయన మృతి ప్రజా సంఘాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు నల్లచెలిమిల గ్రామానికి చెందిన అడ్వకెట్ కాశీ విశ్వనాథ్ మృతదేహంపై బుధవారం ఎర్రజెండా, పూలమాలలు వేసి నివాళులర్పించారు. నల్లచెలిమల గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు. గౌస్ దేశాయ్, ఇండియన్స్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు బి.వీర శేఖర్, జిల్లా అధ్యక్షులు సింగారి లక్ష్మణ్, సిపిఎం సీనియర్ నాయకులు రంగారెడ్డి మాట్లాడుతూ... ప్రజా సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ, అడ్వకేట్‌గా సేవలందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులు కాశీ విశ్వనాథ్ అని తెలిపారు. అనంతరం లాయర్స్ యూనియన్ తరపున ఆ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని గౌస్ దేశాయ్, విజయ్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. పత్తికొండ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుబాబు, సిపిఎం పత్తికొండ మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, తుగ్గలి మండల కార్యదర్శి శ్రీరాములు, దస్తగిరి, గోపాల్, గంగన్న, కాశీ, మద్దికెర రాముడు, రవిచంద్ర, రమేష్, మధుబాబు, సిపిఐ మండల కార్యదర్శి నరసారావు, లాయర్లు రవి ప్రకాష్, సూరజ్, రాజేష్, నాగభూషణం పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బురదలోనే వెళ్లాలి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బదినేహాల్ గ్రామంలో పశు వైద్యశాలకు, అంగన్వాడీ కేంద్రాలకు రైతులు, ప్రజలు చేరుకోవాలంటే బురదలో నడిచి వెళ్లాల్సిన దుస్థితి ఉందని సిపిఎం మండల కన్వీనర్ ఈరన్న ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. పశు వైద్యశాలకు, అంగన్వాడీ కేంద్రానికి గ్రామస్తులు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. చికిత్స చేయించుకోవడానికి కూడా మోకాల్లోకి లోతు నీళ్లలో అష్టకష్టాలు పడుతూ వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. అధికారులు ఉన్నా పశువులు వైద్యానికి నోచుకోవడం లేదని తెలిపారు. పక్కనే ఉన్న అంగన్వాడీ కేంద్రానికి కూడా అధికారులు వస్తున్నా గర్భిణులు, చిన్నపిల్లలు ఎలా రావాలని ప్రశ్నించారు. నీళ్లను తొలగించి గరుసు వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కె.మాబాష, బి.నాగరాజు స్వామి పాల్గొన్నారు.

నిరుపేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని మిలిటరీ కాలనీలో నివసిస్తున్న సూక్ష్మ కళాకారుడు డాక్టర్ బారికి చంద్రశేఖర్ తన ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. దసరా పండగ సందర్భంగా చంద్రశేఖర్ బుధవారం తన ఇంటి దగ్గర కొంతమంది నిరుపేద కుటుంబాలకు మహిళలకు చీర, జాకెట్, పురుషులకు ప్యాంట్, షర్ట్ పీస్, టవల్ పంపిణీ చేశారు. ఇలాంటి పండగ జరుపుకోనిలేని కుటుంబాలకు స్వచ్ఛంద సేవా ద్వారా బట్టలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. బనవాసి భీమేష్, కల్లుకుంట హరినాథ్, హస్త కళాకారిణి బెస్త పార్వతి పాల్గొన్నారు.

శ్రీమఠంలో వాహనాల పూజ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి మఠంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీమఠంలో వాహనాల పూజ నిర్వహించారు. బుధవారం మహర్నవమి సందర్భంగా శ్రీమఠం ఆవరణంలో ఆయుధ పూజలో భాగంగా శ్రీమఠానికి చెందిన వాహనాలకు పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు.

పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ : స్థానిక పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, ఇన్‌ఛార్జీ ఎస్ఐ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఆయుధ పూజ సందర్భంగా అర్చకులు శ్రీరామాచార్ దుర్గా దేకి వేద మంత్రాలతో విశేష పూజలు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున స్వామి, పోలీసులు రామకృష్ణ, పరమేష్, సురేంద్ర, సోమశేఖర్, ప్రతాప్, పార్వతి, హోంగార్డు వీరేష్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించాలి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం చిప్పగిరి పోలీసు స్టేషన్‌లో వేద పండితులు సమక్షంలో ఆయుధ పూజ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం ఆయుధాలకు, వాహనాలకు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పోలీసులు సుబ్రహ్మణ్యం, ఖాదర్ వలీ, షబ్బీర్, భాస్కర్, నరసన్న, శంకర్ పాల్గొన్నారు.

హాలహర్విలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

జిఎస్‌టి ప్రయోజనాలపై అవగాహన : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

జిఎస్‌టి మార్పులతో పేదలకు కలిగే ప్రయోజనాలపై బుధవారం చిప్పగిరిలో ఎంపిడిఒ అల్లాబకాష్ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కల్పిస్తూ జిఎస్‌టి కరపత్రాలను మెడికల్ షాపుల్లో, జనరల్ స్టోర్, కిరాణ షాపుల్లో పంపిణీ చేశారు. జిఎస్‌టి వల్ల కలిగే ప్రయోజనాలపై షాపుల్లో అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, ఆస్పిరేషనల్ అధికారి నరసింహులు, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ పాల్గొన్నారు. **మంత్రాలయంలోని** దుకాణాలు, హోటళ్లలో జిఎస్‌టిపై అవగాహన కల్పించేందుకు ధరలు తగ్గించిన వస్తువులపై రంగులతో ముద్రించిన బ్రోచర్లు అందజేశారు. ఎంపిడిఒ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మహదేవ, పంచాయతీ బిల్ కలెక్టర్లు హనుమంతు, పవన్, గోకుల్, విహార్ హోటల్ నిర్వాహకులు రవికుమార్ గౌడ్, అంజి పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని కౌతాళం-1 ఆర్ఎస్‌కెలో 'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్' నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, యంత్రాలు వాటి పూర్వపు ధరలు, ప్రస్తుత ధరలు, తగ్గింపు ధరలను వివరించారు. ఎసిటిఒ నాయక్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్, ఎఒ శేషాద్రి పాల్గొన్నారు. **హాలహర్విలో** జిఎస్‌టి తగ్గింపుపై కూటమి నాయకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అసుండి శ్రీధర్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ వరలక్ష్మి, ఏపీవో చక్రవర్తి, సర్పంచి మల్లికార్జున, నాయకులు మారుతి పాల్గొన్నారు.

కౌతాళంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఘనంగా గురురాజ్ దేశాయ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నందవరం

దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజు దేశాయ్ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసం దగ్గర పండగ వాతావరణం నెలకొంది. కార్యకర్తలు గ్రామంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అభిమానాన్ని చాటుకున్నారు. తమ అధినేతకు శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అభిమానులు మాట్లాడారు. గురురాజ్ దేశాయ్ స్థాపించిన దేశాయ్ నెట్‌వర్క్ ద్వారా చాలామందికి ఉపాధి కల్పించి వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించాలని తెలిపారు. ఆయనను నమ్ముకున్న కుటుంబాలకు ఏ కష్టం వచ్చినా సహాయ, సహకారాలు అందిస్తున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అలాగే గ్రామంలో చాలామందికి సహాయం అందించే మంచి గుణం ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. సొంత నిధులతో సేవా కార్యక్రమాలను చేపట్టారని చెప్పారు. పేదల సంక్షేమం కోసం ఉచిత టిడిపి సభ్యత్వాన్ని చేయించారని గుర్తు చేశారు. నమ్ముకున్న వారికి ఏ ఇబ్బంది కలిగినా, ఎంత దూరంలో ఉన్నా వెళ్లి పలుకరించి వారికి ధైర్యాన్నిస్తూ, ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాలకు అండగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆయురారోగ్యాలతో జీవిస్తూ ప్రజలకు తమ సేవలను అందించాలని ఆకాంక్షించారు. పుట్టినరోజు, దసరా సందర్భంగా నెట్‌వర్క్ సిబ్బంది, కార్యకర్తలు, తన అభిమానులకు దుస్తులు పంపిణీ చేశారు. గురు రాజ్ దేశాయ్ మాట్లాడుతూ... తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మాజీ సర్పంచి రామన్న గౌడ్, కల్లెల్ శివ, చాకలి హనుమన్న, చాకలి నాగరాజు, ఉరుకుంద, అబ్దుల్, శివ, ఖాసీం పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న గురురాజ్ దేశాయ్

డీఎస్సీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు యుటిఎఫ్ సీనియర్ ఉపాధ్యాయులు జి.రామన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బస్టాండ్ స్కూల్ ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు గద్వాల రామకృష్ణ, కెసి.నాగరాజు, పురుషోత్తం, కెవిపిఎస్ నాయకులు పురుషోత్తం, కరుణాకర్ మాట్లాడుతూ... నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కౌన్సెలింగ్‌లో నూతన ఉపాధ్యాయుల ప్లేస్‌మెంట్ ఎంపిక తర్వాత ఉపాధ్యాయ వృత్తిలో విధుల నిర్వహణ, నియమాలు తదితర అంశాలపై వారికి వివరించి అవగాహన కల్పించారు. వ్యవసాయ, రైతు కూలీ కుటుంబాల నుంచి కష్టపడి తమ ప్రతిభతో ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించిన 14 మంది అభ్యర్థులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వీరేష్, ఖలీల్, అల్లాబకాష్, ఈరన్న, నూతనంగా ఎంపికైన అభ్యర్థులు రేవతి, హెచ్‌కె.షకీల, కృష్ణమూర్తి, ముస్తఫ్ మహబూబ్, ఈశ్వర్, రాజశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులను సన్మానిస్తున్న నాయకులు

'ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి'

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సిఐ గంగాధర్ ఆకాంక్షించారు. బుధవారం దసరా పండగ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. దుర్గామాత చిత్రపటానికి వేద పండితులు నిరంజన్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వాహనాలకు, ఆయుధాలకు పూజలు చేశారు. హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, అంజి, రాము, శ్రీనివాసులు, మల్లి, నరసింహులు, భాస్కర్ పాల్గొన్నారు.

చేనేత శాల స్థలం పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో టిడ్కో జిప్లస్‌త్రీ గృహ సముదాయం వద్ద త్వరలో రూ.కోటితో నిర్మించనున్న చేనేత శాల స్థలాన్ని ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి పరిశీలించారు. బుధవారం ఆ ప్రాంత ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

పత్తి పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పత్తి రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - ఆస్పరి

అధిక వర్షాల వల్ల పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పత్తికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను బుధవారం రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో అత్యధికంగా పత్తిని సాగు చేస్తున్నారని, ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 45 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని తెలిపారు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడులు వస్తాయని ఆశతో ఉన్నప్పటికీ అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. పెట్టిన పెట్టుబడికి కూడా రాని పరిస్థితి ఉందన్నారు. ప్రతేడాది ఎకరాకు 10 క్వింటాళ్ల దాకా పత్తి వచ్చేదని, ఈ సారి 2 నుంచి 3 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం ప్రకటించాలని కోరారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పత్తి పొలాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శించారు. ఆస్పరిని కరువు మండలంగా ప్రకటించి, యుద్ధప్రాతిపదికన గ్రామాలకు వెళ్లి సర్వే చేయాలని కోరారు. లేకపోతే నష్టపోయిన ప్రతి రైతునూ సమీకరించి తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రైతుసంఘం సీనియర్ నాయకులు నబి రసూల్, రామాంజనేయులు, రంగప్ప, నాగరాజు, వెంకట రాముడు, ఈరన్న, సుధాకర్, రంగస్వామి, శివరాజు, చంద్ర, శేఖర్, నజీర్, మహానంది, మల్లికార్జున పాల్గొన్నారు.

టిడిపిలో గ్రూపు విభేదాలకు ఫుల్ స్టాప్..!

- వైకుంఠం జ్యోతిని కలుస్తున్న ఆయా గ్రూపులు

ప్రజాశక్తి - చిప్పగిరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడిపి నుంచి మండలంలో రెండు, మూడు గ్రూపులు తయారయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలూరు నియోజకవర్గంపై దృష్టి పెట్టి అందరికీ ఆమోదయోగ్యమయ్యేలా వైకుంఠం జ్యోతిని ఆలూరు ఇన్‌ఛార్జీగా ప్రకటించారు. కొన్ని గ్రూపులు ఆనందం, సంతోషం వ్యక్తం చేయగా కొన్ని గ్రూపుల్లో ఒకింత అసహనం కనపడినా చంద్రబాబు ఆదేశాలను పాటించాలని మండలంలోని అన్ని గ్రూపులూ వరుస పెట్టి వైకుంఠం జ్యోతి, ఆమె భర్త వైకుంఠం శివప్రసాద్ దంపతులను మర్యాదపూర్వకంగా కలుస్తూ పూలమాల, శాలువాలతో సన్మానించే కార్యక్రమాలు చేపట్టారు. రెండు రోజుల నుంచి వీరభద్ర గౌడ్ గ్రూపులో ఉన్న టిడిపి నాయకులు కూడా తమ తమ నాయకులతో కలిసి దాదాపు 20 జీపుల్లో ఆలూరుకు వెళ్లి వైకుంఠం జ్యోతి దంపతులను కలిసి సన్మానించి వస్తున్నారు. మండలంలో గ్రూపు విభేదాలకు చోటు లేకుండా అందరూ కలిసికట్టుగా ఒకే తాటిపైకి వచ్చినట్లు పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటివరకు దాదాపు అన్ని గ్రామాల వారు వెళ్లినట్లు టిడిపి ముఖ్య నాయకులు తెలిపారు. ఒక రెండు గ్రామాల వారు మాత్రం ఇక్కడే ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతిని చిప్పగిరి మండలానికి పిలిచి కార్యక్రమం చేపట్టి ఘనంగా సన్మానం చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిసింది. మండలంలో టిడిపి గ్రూపులను ఒకే తాటిపైకి తెచ్చే సత్తా ఒక్క వైకుంఠం జ్యోతికి ఉందని పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. అందరినీ కలుపుకొని మండలంలో అభివృద్ధి పనులు జరిగేలా.. టిడిపికి, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేసే బాధ్యత వైకుంఠం జ్యోతి దంపతులపై ఉందని, పేర్కొంటున్నారు. అలా చేస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో టిడిపికి మంచి ఫలితాలు రావడానికి, సొంత మండలంలో పట్టు సాధించడానికి ఆస్కారం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, శివ ప్రసాద్ దంపతులను కలిసిన టిడిపి నాయకులు

'సేవకు గుర్తింపు స్టేట్ డైరెక్టర్ పదవి'

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి చంద్రబాబుతో రామాంజనేయులు

తాను చేసిన సేవలను గుర్తించి బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కట్టబెట్టారని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులుగా వైసిపి హయాంలో ఎన్నో పోరాటాలు నిర్వహించగా కేసులు మోపారన్నారు. తన సేవలను గుర్తించడం సంతోషంగా ఉందని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE : ADONI
I.P.No.09/2022
Kamala Madhu S/o Pullaiah,
Hindu, Aged about 35 years,
R/o Nagaladinne village,
Nandavaram Mandal Kurnool Dist. ...Petitioner
Vs
S.T Ghouse Moddin & others. ...Respondents

GENERAL NOTICE

Whereas the above named petitioner filed petition under Section 10 of Provincial Insolvency Act to declare the petitioner as insolvent. Hence the respondents and anybody wants any objection with regard to the above petition are hereby required to appear before this court on 09.10.2025 at 10.30 AM and answer the said petition, otherwise the petition will be decided exparte.

(By court order)

B.Adisheshappa,
B.A. LL.B.,
Advocate,
Yemmiganur.

వ్యవసాయంలో జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు మండల ప్యాలకుర్తి గ్రామంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారిణి పిఎల్. వరలక్ష్మి, ఎపిఎంఐపి పిడి శ్రీనివాసులు, కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ డిఇఒ రమాదేవి, తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ సిసి రాముడు, మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ హాజరయ్యారు. ప్రతి రైతు కూడా తగ్గినటువంటి జిఎస్‌టిని వినియోగించుకోవాలని, వ్యవసాయ ట్రాక్టర్ల పైన పనిముట్ల పైన గతంలో 12 శాతం ఉన్న జిఎస్‌టిని ఏడు శాతం తగ్గిస్తూ ఇప్పుడు 5 శాతానికి కుదించారన్నారు. డ్రిప్పు పరికరాల పైన స్ప్రింక్లర్ల పైన తగ్గింపు జరిగిందని, సూక్ష్మ పోషకాల పైన బయోపెస్టిసైడ్స్ పైన తగ్గించారని, పాడి పరిశ్రమలో పాల క్యాన్ల కొనుగోలులో డిఎస్‌టి 12 శాతం నుంచి 5 శాతం కు తగ్గిందన్నారు. ఆక్వాకల్చర్ లో కూడా జిఎస్‌టిని 12 శాతం నుంచి 7 శాతం కు తగ్గించారన్నారు. ఈ విధంగా వ్యవసాయ, అనుబంధ శాఖలలో తగ్గిన జిఎస్‌టిని మండలంలోని ప్రతి గ్రామంలో ఆర్ఎస్కే లో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు తెలియజేయాలని అన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై కోడుమూరులో వ్యవసాయ అధికారుల ప్రదర్శన

అనంతరం గ్రామంలో అధికారులు రైతులు కలిసి వ్యవసాయ ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, డ్రోన్ వంటి పరికరాలతో ర్యాలీ నిర్వహిస్తూ తగ్గిన జిఎస్‌టి గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది గ్రామ రైతులు, ఉగాది వెంకటేశ్వర్లు, సీతారాముడు, కిరణ్ , జర్మన్ భాష, షేక్ మిన్నెల పాల్గొన్నారు.

వైఎస్‌షర్మిలపై ఆరోపణ తగదు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిపై రాం పుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్ విమర్శలు చేయడం తగదని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష తెలియజేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిలాని భాష మాట్లాడుతూ రాం పుల్లయ్య యాదవ్ సోదరులు పిసిసి అధ్యక్షురాలు షర్మిలపై అనవసర విమర్శలు చేయడం తగదు అన్నారు అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు మాట్లాడుతూ . కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఇప్పుడు మరల తమ పార్టీ అధ్యక్షురాలుపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదన్నారు ఈ సమావేశంలో ఐ ఎన్ టి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిలానీబాష, సుధాకర్‌బాబు తదితరులు

యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి బాష, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్‌సి బజారన్న, ఐఎన్‌టియుసి సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్ కాంగ్రెస్ నాయకులు షేక్ మాలిక్‌బాషా, వార్డు ఇంచార్జీలు ఎన్ సుంకన్న, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఎంహెచ్‌ఒ, తదితరులు

అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రోగ్రాం అధికారులతో కలిసి గోడపత్రికలను జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో డి ఎం హెచ్ఒ డాక్టర్ పి శాంతికళ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవము జరుపుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ , ప్రాథమిక, పట్టణ, సామాజిక ఆరోగ్యకేంద్రాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమాలలో వైద్య శిబిరాలు , ఫిజియోతెరఫీ నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా, పిఒఆర్‌బిఎస్‌కె అండ్ ఎన్ సి డి డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్, ఎన్‌సిపి నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు , డిపిఒ డిబిసిఎస్ డాక్టర్ సంధ్య రెడ్డి , ఎస్ఒ హేమసుందర్ , డిపిఒ ఎన్ హెచ్ యం విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా కరిమద్దెల భాస్కర్ రావు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన కూటమి ప్రభుత్వానికి కరిమద్దెల భాస్కర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో కతజ్ఞతలు తెలిపారు. నా మీద నమ్మకంతో కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు నిస్వార్థపాతంగా సేవలు అందిస్తానని తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే, జనసేన పార్టీ మత్స్యకార విభాగం చైర్మన్ బొమ్మిడి నాయకర్‌లకు కరిమద్దెల భాస్కర్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలివ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రబీ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో శనగలు ఇతర విత్తనాలు 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని ఎపి రైతు సంఘం మండల నాయకులు ఎస్ మధుసూదన్ డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్ మండలంలోని నన్నూరు గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ శాఖ అధికారికి ఎస్ మధుసూదన్‌కు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు టి మల్లేష్‌లు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమైన తరుణంలో ప్రభుత్వం రైతులకు 90 శాతం సబ్సిడీతో శనగలు ఇతర విత్తనాలు ఎరువులు అందించాలన్నారు. ఇప్పటికే రైతులు అధిక వర్షాల వల్ల ఉల్లి ,పత్తి ఇతర పంటలు దెబ్బతిన్నాయన్నారు. రబీ సీజన్‌కు తగినన్ని విత్తనాలు ఎరువులు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొజ్జన్న, బషీర్, సలాంబాష, శ్రీనివాసులు, రామాంజనేయులు, హరి తదితరులు పాల్గొన్నారు.

మాజీఎమ్మెల్యే సైన్యంతో గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-పత్తికొండ...

పత్తికొండ నుండి మంత్రాలయం వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం గుంతలు పడి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్న తీరును చూసి బుధవారం పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సైన్యం సభ్యులు విరుపాక్షి, రామాంజనేయులు, పెద్ద హుల్తి సర్పంచి కోలంట్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జెసిపి ట్రాక్టర్ల ద్వారా మట్టిని వేసి గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తికొండ నుండి ఆదోని మంత్రాలయం వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం కావడంతో రోజు కొన్ని వందల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. గుంతలు పడిన రోడ్డును ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. వాహనాలు గుంతలలో ఇరుక్కుపోయి ,చెడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకూడదని ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛందంగా కంగాటి శ్రీదేవమ్మ సైన్యం ప్రజలకు చేతనైన సహాయంతో చేయడానికి ముందుంటుందని అన్నారు.భవిష్యత్తు కూడా అనేక కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

జిజిహెచ్ పేన్‌లెస్ లేబర్ డెలివరీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గైనిక్ విభాగంలో పేన్‌లెస్ లేబర్ డెలివరీ క్లినిక్ ను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రసవ సమయంలో తల్లులకు నొప్పి లేకుండా, మరింత సురక్షితమైన , సౌకర్యవంతమైన ప్రసవం జరగడానికి ఈ క్లినిక్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని అన్నారు. ఆసుపత్రిలో ఆధునిక వైద్య సాంకేతిక పద్ధతుల ద్వారా గర్భిణీ స్త్రీలకు భరోసా కలిగించే విధంగా ఈ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఆసుపత్రిలోని క్యాన్సర్ విభాగంలో రోగుల నొప్పి నివారణ కోసం పేన్‌లెస్ క్లినిక్ కూడా ఉపయోగపడనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఇంచార్జ్ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ కిరణ్ కుమార్, గైనిక్ విభాగపు హెచ్ఒడి, డాక్టర్ సావిత్రి, ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ హెచ్ఒడి, డాక్టర్ రామ్ శివ నాయక్, అనస్థీసియా విభాగపు హెచ్ఒడి డాక్టర్ విశాల, గైనిక్ విభాగపు వైద్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంచలింగాలలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ నాగరాజు

అభివృద్ధి తో పాటు సంక్షేమానికి పెద్ద పీట

-ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

అభివృద్ధితోపాటు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం కర్నూలు రూరల్ మండలం, పంచలింగాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన... ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులను అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం లో రాష్ట్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆరోపించారు.. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అతి తక్కువ కాలంలోనే రాష్ట్రాన్ని అభివద్ధి చేసిందన్నారు. ఇక కర్నూలు జిల్లా ఇటు పరిశ్రమల పరంగా, అటు ఇరిగేషన్ పరంగా అభివద్ధి చెందబోతుందని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మికుల పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సంక్షేమ బోర్డు పున ప్రారంభించాలని పెండింగులో ఉన్న క్లైయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఉన్న పోస్ట్ బాక్స్‌లో ప్రభుత్వానికి భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కరించాలని పోస్ట్ కార్డుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రహిమాన్ నల్లన్న డి.దర్గన్న, వెంకటేష్, ప్రసాదులు కలిసి రాష్ట్ర ప్రభుత్వానికి అందేలా పోస్ట్ కార్డులు వేశారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డును పునః ప్రారంభిస్తామని. పెండింగ్లో ఉన్నటువంటి 47 క్లైమ్స్‌లను విడుదల చేయాలని మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా భవననిర్మాణ కార్మికులు పోస్ట్ ద్వారా పంపామన్నారు.